# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **49 సంవత్సరాల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులను తక్షణమే ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **ప్రభుత్వ ఆస్తులు, నాలాలు, చెరువులను కాపాడేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్.. హైడ్రాను బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతం కోతను నివారించడంపై ప్రత్యేక దృష్టి సారించామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా వివేక్ యాదవ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది.**

==========================

49 సంవత్సరాల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నిన్న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విషయాన్ని హోం మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా వెల్లడించారు. 1975 జూన్ 25వ తేదీన అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన నియంతృత్వ పాలనతో దేశంలో అత్యయిక స్థితి విధించి ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారని అమిత్ షా పేర్కొన్నారు. ఎలాంటి కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టడమే కాకుండా, పత్రికల గళాన్ని అణగదొక్కారని.. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25వ తేదీని 'సంవిధాన్ హత్యా దివస్'గా నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలు అనుభవించిన వేదనను, దాన్ని ఎదిరించి నిలబడిన యోధులను ఆ రోజున గుర్తుచేసుకుందామని అమిత్ షా పిలుపునిచ్చారు. కాగా.. ఈ ప్రకటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. నాటి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అణగదొక్కి ఎలాంటి పాలన సాగించిందో ఈ సంవిధాన్ హత్య దివస్ మనకు గుర్తుచేస్తుందని తెలిపారు. దేశ చరిత్రలో కాంగ్రెస్ రాసిన చీకటి అధ్యాయం కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునే రోజు అది అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులను తక్షణమే ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రహదారులు, భవనాల శాఖపై నిన్న ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, పరిస్థితిపై ఆరా తీశారు. గుంతలు పూడ్చేందుకు తక్షణం 300 కోట్లు అవసరమని అధికారులు తెలపగా.. అత్యవసర పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్లను బాగుచేసే ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో 4 వేల 151 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతల సమస్య ఉందని, తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2 వేల 936 కిలోమీటర్ల మేర ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్రంలో 7 వేల 87 కిలోమీటర్ల పరిధిలో తక్షణం పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

-------------------------

హైదరాబాద్ మహా నగర పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగాన్ని విస్తృతం చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్.. హైడ్రా విధి విధానాలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు సంబంధిత అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు బాధ్యత హైడ్రాకు ఇవ్వాలని సూచించారు. జోన్ల విభజనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన నిబంధనలు రూపొందించాలని ఆదేశించారు. ఒక బలమైన వ్యవస్థగా హైడ్రా ఉండాలని, అందుకు అవసరమైన ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 16వ తేదీన జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, పోలీసు కమిషనర్లతో జరిగే రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌లో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. దీనికి సంబంధించిన అజెండాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఖరారు చేశారు. మొత్తం 9 అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. వాటికి సంబంధించిన వివరాలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లను ఆమె ఆదేశించారు. ఇటీవలే అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. వారానికో జిల్లాలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షిస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటు చేశారు.

-------------------------

ఒడిశాలోని నైనీ వద్ద సింగరేణి సంస్థ చేపట్టిన బొగ్గు గని ప్రాజెక్టులో తవ్వకాలు చేపట్టేందుకు సహకరించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కోరారు. దీనిపై స్పందించిన ఆయన నైనీ బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిగా సహకరిస్తామని హామీ ఇవ్వడంతో పాటు, తగిన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నైనీ బ్లాక్‌లో సింగరేణి కార్యకలాపాలకు అడ్డంకులు లేకుండా చూడాలని కోరేందుకు భట్టి విక్రమార్క.. అధికారుల బృందంతో కలిసి ఒడిశా ముఖ్యమంత్రిని నిన్న ఆ రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సింగరేణికి బొగ్గు బ్లాకుల ఆవశ్యకతను వివరించారు. 2017లోనే సింగరేణికి నైనీ గనులను కేటాయించారని భట్టి విక్రమార్క తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో అలల ఉద్ధృతికి భూమి కోతకు గురికాకుండా నివారించేలా జాతీయ తీర

ప్రాంత పరిశోధన కేంద్రం.. ఎన్‌సీసీఆర్, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత నిర్వహణ సంఘం మధ్య ఒప్పందం కుదిరింది. తీర ప్రాంత నిర్వహణపై ఎన్‌సీసీఆర్ రూపొందించిన ప్రణాళికను ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన నివాసంలో నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి వరంగా ఉన్న సముద్ర తీర ప్రాంతం కోతకు గురికావడం ఆందోళన కలిగిస్తోందని.. దీన్ని నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇటీవల ఉప్పాడ తీరంలో కోతపై సమీక్షించి నిపుణులతో చర్చించామని వెల్లడించారు. రాష్ట్రంలోని తీరం వెంట కోత సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేయాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. కొత్త ఓడ రేవులు, ఫిషింగ్ హార్బర్ల కోసం అనువైన ప్రదేశాలు ఎంచుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గతంలో నిలిచిపోయిన నిర్మాణాల పటిష్ఠత ఎలా ఉందో తెలుసుకోవడానికి ఐఐటీ ఇంజనీర్లతో అధ్యయనం చేయించాలని నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఐకానిక్ భవనాల ఫౌండేషన్ పటిష్టత నిర్ధారణ కోసం ఐఐటీ చెన్నైకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల నివాసాల పటిష్టత నిర్ధారణ బాధ్యతలు ఐఐటీ హైదరాబాద్‌కు అప్పగిస్తామని.. ఐఐటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా వివేక్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్‌కు సమాచారం అందింది. సీనియర్ ఐఏఎస్ అధికారి ముకేష్ కుమార్ మీనా ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో 81.66 శాతం ఓటింగ్ నమోదు కావడానికి ఆయన చేపట్టిన చర్యలే కారణమయ్యాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ముకేష్ కుమార్ మీనాకు కీలక బాధ్యతలు అప్పగించాలనే ఉద్దేశంతో కొత్త ప్రధాన ఎన్నికల అధికారి నియామకానికి ఎన్నికల సంఘానికి ముగ్గురు అధికారుల పేర్లు పంపించింది. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ.. సీఆర్‌డీఏ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వివేక్ యాదవ్ పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది.

---------------------------

కేరళ నుంచి గుజరాత్ వరకు అరేబియా సముద్ర తీరం వెంబడి ద్రోణి కొనసాగుతుండగా.. అసోం నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి విస్తరించిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో కోస్తాలో రుతుపవనాలు చురుగ్గా మారడంతో నిన్న పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయని.. రాబోయే 24 గంటల్లో కోస్తాలో ఎక్కువ చోట్ల, రాయలసీమలో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. రేపటి నుంచి 17వ తేదీ వరకు విస్తారంగా వర్షాలు, చెదురుమదురుగా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. బంగాళాఖాతంలో రుతుపవన కరెంట్ బలంగా ఉండడంతో కోస్తాలో తీరం వెంబడి గంటకు 45 నుంచి 55, అప్పుడప్పుడు 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని, అందువల్ల మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

---------------------------

సైబర్ నేరగాళ్లు ఇండియా పోస్ట్ పేరుతో లింకులు పంపిస్తూ డబ్బు దోచేందుకు చేస్తున్న ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని పత్రికా సమాచార సంస్థ.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ప్రజలకు సూచించింది. సంక్షిప్త సందేశాల ద్వారా వస్తున్న ఈ మోసపూరిత లింకులను తెరవవద్దని సూచిస్తూ ట్వీట్ చేసింది. తపాలా శాఖ నుంచి మీకు పార్శిల్ వచ్చిందని డెలివరీ చేద్దామని రెండుసార్లు ప్రయత్నించినా చిరునామా సరిగా లేనందువల్ల సాధ్యం కాలేదని సదరు లింకులో పేర్కొంటారని తెలిపింది. 48 గంటల్లో చిరునామాను అప్‌డేట్ చేసుకోకుంటే ప్యాకేజీ వెనక్కి వెళ్లిపోతుంది అంటూ కొందరికి సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపిస్తున్నారని పేర్కొంది. చిరునామా అప్‌డేట్ కోసం ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేసినప్పుడు ఇండియా పోస్ట్ తరహా వెబ్‌సైట్ తెరుచుకుని.. అక్కడ ట్రాకింగ్ ఐడీ దగ్గర డెలివరీ ఫెయిల్యూర్ అనే సందేశం కనిపిస్తుంది. తర్వాత చిరునామా అప్‌డేట్ చేసుకోండనే సందేశం చూపించి మోసపూరిత సాఫ్ట్‌వేర్‌ను మీ ఫోన్‌లోకి చొప్పించి మీ మొబైల్‌ను సైబర్ నేరగాళ్లు అధీనంలోకి తీసుకొనే అవకాశం ఉంటుందని పీఐబీ హెచ్చరించింది.

======================